

## పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో గెలిచిన ఎమ్మెల్యేలు బుధవారం భేటీ అయ్యారు. పవన్ కళ్యాణ్‌తో భేటీకి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సహా 20మంది ఎమ్మెల్యేలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే గా గెలిచిన జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పవన్ కళ్యాణ్ కు కతజ్ఞతలు తెలియజేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవన్ కళ్యాణ్‌కు అందచేశారు. భారీ మెజార్టీతో గెలిచావ్ అంటూ ఆరణి శ్రీనివాసులు భుజం తట్టి పవన్ కళ్యాణ్ అభినందించారు. అనంతరం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు ఆరణి మధన్, ఆరణి జగన్ పాల్గొన్నారు.

# టి 'డి' ఆర్ బాండ్లు

## వైసిపి కొంపముంచి.. జనసేనకు 'జై' అనిపించి..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏదైతే అభివృద్ధి చేశామని సిట్టింగ్ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి చెబుతున్నారో... ఓ రకంగా ఆ అభివృద్ధి మాటున అక్రమాల టిడిఆర్ బాండ్లు ఆ పార్టీ కొంప ముంచాయని చర్చ నడుస్తోంది. ఇవే టిడిఆర్ బాండ్లను జనసేన తరపున గెలుపొందిన ఆరణి శ్రీనివాసులు బాగా ఉపయోగించుకున్నారు. తొలుత ఆరణి శ్రీనివాసులు చిత్తూరు నుంచి వలస వచ్చారని వ్యతిరేకించినా, 'నాన్ లోకల్' అని ముద్ర వేసినా అందరినీ ఏకతాటిపైకి తెచ్చి, వైసిపి ఐదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలను ప్రచారాస్త్రాలుగా సంధించడంలో సక్సెస్ అయ్యారు. భూకబ్జాలు, గంజాయి విచ్చలవిడి అమ్మకాలు వైసిపి కొంపముంచాయి. ముఖ్యంగా మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో పెద్దఎత్తున 18 రోడ్లు వేయాలని కౌన్సిల్లో భూమన అభినయ్‌రెడ్డి చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. అందులో 12 రోడ్లకు ఫ్రీలెఫ్ట్ రోడ్లు వేయాలని నిర్ణయించారు. అయితే ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసేటపుడు భూ యజమానులతో సంప్రదించకుండా బలవంతంగా ఇష్టానుసారంగా భూసేకరణ చేశారన్న ఆరోపణలున్నాయి. భూములు కోల్పోయిన బాధితులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కొంతమంది కోర్టును సైతం ఆశ్రయించారు. టిడిఆర్ బాండ్ల జారీలోనే అవినీతి భారీగా జరిగిందని టిడిపి ఆరోపణ. చిన్నాచితక స్థలాలు ఉన్న భూ యజమానులు తమ స్థలాలు పోయాయని, నష్టపరిహారం ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా, అవే టిడిఆర్ బాండ్లను వైసిపి నేతలు తీసుకుని, అధిక ధరలకు విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

నగరంలో దాదాపు 12 మాస్టర్‌ప్లాన్ రోడ్ల పరిధిలో 50 మంది పైగా కోర్టును ఆశ్రయించారు. ఈ రహదారుల నిర్మాణం పేరుతో అనేక కట్టడాలను కూల్చేశారు. వాటికీ నష్టపరిహారం ఇవ్వలేదు. టిడిఆర్ బాండ్లు ఇస్తామని చెప్పిన వారికీ ఇవ్వలేదు. మున్సిపల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలను కూల్చేశారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి తిరుపతి కార్పొరేషన్ సంబంధించిన 50 కోట్ల రూపాయలు బ్యాంకులో డిపాజిట్ ఉంటే వాటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నారని తెలుస్తోంది. మిగిలిన రోడ్లకు నిధులు లేకపోవడం వల్ల ఆగిపోయాయి. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు దాదాపు 250 మందికి టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని వైసిపి నేతలు భావించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఆరోపణలు రావడంతో ఇవ్వలేదు. దీంతో బాధితులు టిడిఆర్ బాండ్లు ఇస్తారో లేదో అనే సందేహంతో కుమిలిపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టిడిఆర్ బాండ్లు ఎప్పటిలోపు ఇస్తారో అనే ఆశతో బాధితులు ఎదురుచూస్తున్నారు. తిరుపతి ఎంఎల్‌ఎగా గెలుపొందిన ఆరణి శ్రీనివాసులు టిడిఆర్ బాండ్లను ఇప్పించాలని కోరుతున్నారు.

**'జె' ట్యాక్స్‌లు రద్దు చేయండి : బాధితులు**

వైసిపి కార్పొరేటర్ల ఆగడాలకు చెక్ పెట్టాలని తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులును బాధితులు కోరుతున్నారు. నగరంలో 50 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లు 'జె' ట్యాక్స్ పేరుతో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేయడమే గాకుండా, ఇవ్వని వారిని పనులు జరగనీకుండా అడ్డుకుంటున్నారు. తిరుపతి కార్పొరేషన్‌లో ఏ చిన్న పని జరగాలన్నా జె ట్యాక్స్ మామూళ్లు చెల్లించాల్సిందే.

**దుర్వినియోగంపై విచారిస్తాం : నరసింహయాదవ్**

**తిరుపతి (మంగళం) :** టిటిడి నిధులను, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన తీరుపై చట్టబద్ధంగానూ, న్యాయబద్ధంగానూ విచారించి వాస్తవాలను వెలుగులోకి తెస్తామని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా శ్రీవారి హుండీని దోచుకోవడం వల్లనే వైసిపి చెత్తగా ఓడిపోయిందన్నారు. జగన్ సర్పంచుల వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. టిటిడి నిధులు, టిడిఆర్ బాండ్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిస్తానన్నారు. శ్రీవాణి ట్రస్టు నిధులు ఏ విధంగా గల్లంతయ్యాయో, ప్రభుత్వానికి చేరాయో కూడా అంతు చూస్తామన్నారు.

## ధర్మారెడ్డి పాపాలే జగన్‌కు శాపాలు : నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమలలో ఈవో ధర్మారెడ్డి చేసిన పాపాలే జగన్‌కు శాపాలుగా మారి కోలుకో లేని ఓటమి దెబ్బ తీశాయని కాంగ్రెస్ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల కేంద్రంగా శ్రీవారి సేవ టికెట్లను సినిమా టికెట్లుగా భావిస్తూ అమ్మేసి కోట్లు వెనకేశాడని ధర్మారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోయాక కూటమి అధికారంలోకి రావడంతో తాను చేసిన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో అమెరికాకు పోవడానికి ప్రయత్నిస్తున్నాడని, ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మారెడ్డి తిరుమల విడిచి పోకుండా అధికారులు తగిన ఆంక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ధర్మారెడ్డి జగన్ ప్రభుత్వానికి కొమ్ముగాస్తూ టీటీడీ నిధులను ఏ విధంగా దారి మళ్లించారో సిట్టింగ్ జడ్జితో విచారణ చేపడితే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. సామాన్య భక్తులపైనా కేసు పెట్టిన ఘనత ధర్మారెడ్డికి చెల్లుబాటు అవుతుందన్నారు. ధర్మారెడ్డి చేసిన అక్రమాలలో కొంతమంది అర్చకులు, ఈవో కార్యాలయ సిబ్బంది ఆ పాపాల్లో భాగస్వామ్యులుగా ఉన్నారని, ఎవరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. టీటీడీకి సంబంధించిన ఫిక్స్ ‌డ్ డిపాజిట్లు జాతీయ బ్యాంకులు నుండి ప్రైవేటు బ్యాంకులకు ఎలా మారయో అన్నీ బయటకు తీస్తామన్నారు. ధర్మారెడ్డి 30 వేలకు సేవా టికెట్లను అమ్ముకునే స్థాయికి దిగజారి పోయాడని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో హరిప్రసాద్, లోకేష్, జీవన్, త్రిలోక్ కుమార్, తనూజ్ పాల్గొన్నారు.

## గిరిజన కాలనీల్లో ఉపాధ్యాయుల ప్రచారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, బడికి వస్తూ మధ్యలో నిలిచిపోయిన పిల్లలను తిరిగి బడికి పంపాలని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి దాసులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కరపత్రాలు ముద్రించి పాఠశాల పరిధిలోని గాంధీకాలనీ, మొక్కలచేను, తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహనకల్పించారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న ఐఎఫ్‌పిఎస్ టీవీలతో బోధన, అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద రాగిజావ, పదో తరగతికి ప్రత్యేక తరగతులు, ట్యాబ్ సౌకర్యంతో బైజూస్ పాఠాలు బోధన వంటి వివరాలతో కరపత్రాలను పంచుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## నీట్ -యుజి ఫలితాల్లో 'నారాయణ' ప్రభంజనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) మంగళవారం విడుదల చేసిన నీట్ -యుజి ఫలితాలలో తిరుపతి నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల డిజియం కొండలరావు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లిలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయి చేతన్ రెడ్డి 720కి 710 మార్కులు సాధించి ఆలిండియా జనరల్ క్యాటగిరిలో 701 వ ర్యాంకు, జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 60వ ర్యాంకు సాధించాడని, ఆకాంక్ష 681, తన్మయి 680, హర్షవర్ధన్ 677, సాయి నేహాంజలి 677, రేష్మిత్ రెడ్డి 671, సాయి సమిత్ రెడ్డి 659, అక్షయ 654, నవ్య 627, మానస్ 626, మనస్విని 618, శ్రీ లహరి 616, లేఖశ్రీ 615 వంటి టాప్ మార్కులతో 600కు పైగా 13 మంది, 500 కు పైగా 30 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని, అన్ని కేటగిరీలలో కలిపి తమ విద్యార్థులు 50 కి పైగా ఎంబిబిఎస్ సీట్లు సాధించబోతున్నారని తెలిపారు. ఉత్తమ ర్యాంకుల సాధించిన విద్యార్థులను డీన్లు కష్ణారెడ్డి, వేణుగోపాల్, ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరావు, సుధాకర్ నాయుడు, ఏజీఎంలు చెన్నకేశవరావు, రమణారెడ్డి అభినందించారు.

## వడగండ్ల వర్షం... మామిడి రైతుకు నష్టం

ప్రజాశక్తి -బాలాయపల్లి

మండలంలోని అలిమిలి, వెంకటరెడ్డిపల్లి, అంబలపూడి, నిండలి గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. వడగండ్లు పడడంతో పశువుల రేకుల షెడ్లు దెబ్బతిన్నాయి. అకాల వడగండ్ల వానతో అపార నష్టం వాటిల్లిందని మామిడి తోటలు కౌలుకు తీసుకున్న రైతులు వాపోయారు.

## టిడిపి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి కూటమి జిల్లాలో క్లీన్ స్వీప్ చేపట్టడంతో కార్యకర్తలు బుధవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

**సత్యవేడులో...** ఎంఎల్‌ఎగా కోనేటి ఆదిమూలం విజయకేతనం ఎగురవేయడంతో టిడిపి శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. గాంధీరోడ్డు గంగమిట్ట వద్ద గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షులు మురళి (చికెన్ చిన్న) ఆధ్వర్యంలో బలిజ సంఘం నాయకులు బాలమురళీకృష్ణ, నరసరాజు అగ్రహారం, సర్పంచి బాలాజీ, లక్ష్మీనారాయణ, గురు, గణేష్, మణి తదితరుల సమక్షంలో గంగమ్మకు 1001 కొబ్బరికాయలు కొట్టారు. మురళి మాట్లాడుతూ గతంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. దెబ్బతిన్న రోడ్లను తట్టమట్టి పోసి పూడ్చలేని స్థితి వచ్చిందన్నారు. ఇకపై నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. త్వరలోనే సదవాలమ్మకు పొంగల్ పెట్టి మొక్కు తీర్చుకుంటామన్నారు.

**తిరుపతి (మంగళం)లో...** పులివర్తి నాని గెలుపుతో మంగళం సప్తగిరి కాలనీ పంచాయతీ టిడిపి నాయకులు బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు. సుబ్బయాదవ్, భాస్కర్‌రెడ్డి, అల్లాబాషా తదితరులు పాల్గొన్నారు. ఎంఆర్‌ఎ ఆరణి శ్రీనివాసులు అఖండ మెజార్టీతో గెలుపొందడంతో అఖిల భారతీయ యాదవ మహాసభ నాయకులు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఉదయ్ యాదవ్, దిలీప్, హరి, రాజా పాల్గొన్నారు.

## ఆలయంలో 'అవినీతి'ని అంతం చేస్తా : బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో అవినీతిని అంతం చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. నెలన్నర కాలంలోనే శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారీ వ్యవస్థను కూకటివేళ్ళతో సహా పెకలించడంతో పాటు పలు పెను మార్పులను తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే హోదాలో తొట్ట తొలిగా కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం స్వామీ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం నిత్యాన్నదాన సత్రాన్ని పరిశీలించి అన్న ప్రసాదాల నాణ్యతను భక్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. లోకేష్ పాదయాత్ర రాష్ట్రంలో టిడిపి గ్రాఫ్ పెరగడానికి దోహద పడిందనీ, బాబు అరెస్టు వైసీపీ పతనాన్ని శాసించిందని వివరించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి సమేత అమ్మవారికి బంగారు తాపడం చేయించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఆలయంలోని అన్ని స్తంభాలకు బంగారు తాపడం చేయిస్తామని అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మీడియాపై ఆంక్షలు ఎత్తివేయాలనీ, వారికి దక్షిణామూర్తి ఆలయం వరకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రాహు కేతు పూజల్లో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేస్తామనీ, హద్దు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గోశాలకు పూర్వవైభవం తెస్తాననీ, ఆలయంలో పారదర్శక పాలన సాగకుంటే పర్యావసనాలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డితో పాటు ఆయన తల్లి బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - యంత్రాంగం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ చెట్లను నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి, వాతావరణ సమతుల్యతకు కృషి చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా మొక్కలను నాటడం జరిగింది.

**సత్యవేడులో...** శ్రీసిటీలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగ అధికారి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన సత్యవేడు అటవీశాఖ రేంజ్ అధికారి జి.జయప్రసాదరావు, చెన్నైకు చెందిన ప్రముఖ ఎపి కల్చరిస్ట్ ప్రొఫెసర్ విలియం జేమ్స్ స్థానిక నర్సరీ ఆవరణలో తలపెట్టిన ఉమ్మడి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణం, పరాగ సంపర్కంలో తేనెటీగల కీలక పాత్ర గురించి ప్రొఫెసర్ విలియం జేమ్స్ వివరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సందేశం ఇచ్చారు.

**బిఎన్‌కండ్రిగలో..** భూమికి అందాన్ని, జీవాన్ని ఇచ్చేది జీవావరణమని, పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి, దాసు అన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు.

**గూడూరు టౌన్‌లో ...** యూనిట్ అధికారి రామరాజు ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వైద్యసిబ్బంది గోపి, ప్రవీణ, వాణి పాల్గొన్నారు. పట్టణంలోని నెలక్యాస్ట్ కర్మాగారంలో డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీరాం మొక్కలు నాటారు. దాదాపు వంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిజిఎం హెచ్‌ఆర్ పళణి మురుగన్, ఫైనాన్స్ సీనియర్ మేనేజర్ ప్రభు, పిఆర్‌ఒ అనిమెళ్ల శివకుమార్ పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..** బాబు అగ్రహారం మున్సిపల్ ఉన్నత, జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మొక్కలు నాటారు. రోవర్లు కార్యాలయ కమిషనర్ టి.రమేష్‌బాబు, ట్రైనింగ్ కమిషనర్ సి.సావిత్రి, యూత్ ఛైర్మన్ ఎస్‌కె అజారుద్దీన్, గైడ్ కెప్టెన్ సులోచన దేవి పాల్గొన్నారు.

**పుత్తూరు టౌన్‌లో...** పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఇఒ తిరుమలరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటినట్లు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి తెలిపారు.

**తిరుపతి (మంగళం) :** రేణిగుట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌రెడ్డి మొక్కలు నాటి పర్యావరణ దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. తిరుపతి -కరకంబాడి మార్గంలోని బయోట్రిమ్‌లో స్టేట్ సిల్వికల్చరిస్ట్ ఐఎఫ్‌ఎస్ అధికారిణి యశోద భాయ్ ఆధ్వర్యంలో బయోట్రీమ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. పరివర్తన సేవా సంస్థ అధ్యక్షులు పి.అమరనాథ్, ఇఎస్‌ఐ నర్సింగ్ సూపరింటెండెంట్ సి.అమ్ములు పాల్గొన్నారు. మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద వెయ్యి గుడ్డ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. రఫీ హిందుస్తానీ హెల్పింగ్ హ్యాండ్స్ విజయబాబు పాల్గొన్నారు. అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఆపరేషన్ హెడ్ ఎం.శ్రీనివాసరావు, బి.మునీశ్వర్‌నాయుడు, సి.మురళి ఆధ్వర్యంలో జరిగింది. 1550 మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. రీజినల్ సైన్స్ సెంటర్‌లో సీనియర్ ఇంజినీర్ నరేంద్రబాబు, ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం, ఎస్వీయూ ఎన్విరాన్మెంట్ విభాగం ప్రొఫెసర్ దామోదరం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, ఆటలు, క్విజ్ పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస నెహ్రూ, అశోక్ కుమార్, రామకష్ణారెడ్డి, పద్మనాభం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో..

అమరరాజాలో..

## పాదరక్షలు లేకుండా రెండేళ్లు దీక్ష

### మొక్కులు తీర్చుకున్న సురేంద్ర యాదవ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

టీడీపీ గెలుపు కోసం తొట్టంబేడు మండల బీసీ సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్ అకుంఠిత దీక్ష బూనాడు.. రెండేళ్లుగా పాదరక్షలు మాని అధినేత చంద్రబాబు, ఇంచార్జి సుధీర్ రెడ్డి గెలుపుకోసం అహర్నిశలు శ్రమించాడు. ఆఖరుకు ఆయన దీక్ష ఫలించింది. ఆయన కోరుకున్నట్లుగా టీడీపీ కూటమి సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా బొజ్జల వెంకటసుధీర్ త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన కోరిక ఫలించడంతో బుధవారం చోడవరం గ్రామంలో పోలేరమ్మకు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ గెలుపుకు కషి చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేశారు. బొజ్జల సుధీర్ రెడ్డి సారథ్యంలో మండల అభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. తాతయ్య, చంద్రారెడ్డి, ఎర్రయ్య, గురునాథం, సురేష్ యాదవ్, గౌరీ, సుధాకర్, రమేష్, చిరంజీవి, మహేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 'నీట్'లో బివికె విజయదుందుభి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

నీట్ – 2024 ఫలితాలలో డాక్టర్స్ మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారని ఆ కళాశాల చైర్మన్ బి.వి.కష్ణారెడ్డి తెలిపారు .ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరిలతో మాట్లాడుతూ డాక్టర్స్ మెడికల్ అకాడమి కళశాల నుంచి 80 మంది తమ విద్యార్థులు 2024లో ఎంబీబీఎస్ సీట్లు సాధించబోతున్నారని తెలిపారు. బైపిసి చదువుతున్న తమ విద్యార్థులు నీట్లో 720 మార్కులకు గాను సి.సాధ్విక 661, బసవలింగ 658, కె.దినేష్ 657, పి.సాయి ధన్విత 655, కె. లహరి 642, జి.బాలాజి 637, కె. వంశీధర్ రెడ్డి 631, పి.జ్యోతివర్ధన్ రెడ్డి 618, కె.శ్రీదేవి 615, ఆర్.వజ్ర 610, కె.భవ్య శ్రీ 610, షేక్ మీరజ్ 609, బి.రోషిత 604, కె.షనితా మాధురి 600, కే.శ్రావణి 600 మార్కులు సాధించారు. 550 మార్కుల పైగా 25 మంది, 500 మార్కుల పైగా 50 మంది, 450 మార్కుల పైగా 150 మంది, మొత్తం 80 మంది పైగా విద్యార్థులకు ఫ్రీ మెడికల్ సీట్లు సాధిస్తారని చైర్మెన్ బి.వి కష్ణారెడ్డి తెలిపారు. విజయానికి ముఖ్యకారణం సీనియర్ అధ్యాపకబృందంచే క్లాస్ రూమ్ టీచింగ్, స్టడీఅవర్స్ నిర్వహించడమన్నారు. అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల చైర్మెన్ బి.వి. కష్ణారెడ్డి, వైస్ ఛైర్మెన్ పార్థీవ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కె. రహీమ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

SADVIKA C - 661

2. BASAVALINGAM - 658

3. K DINESH - 657

4. SAI DHANVITHA P

## ఎన్ఎంఎంఎస్‌కు కల్లివెట్టు విద్యార్థి ఎంపిక

ఉపకార వేతనానికి ఎంపికైన దీపిక

**ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:** గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్షలో మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దీపిక ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపికైన ఈ విద్యార్థినికి ఏడాదికి 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు దీపికను అభినందించారు.

## అరిగెల నాగార్జున ఆధ్వర్యంలో సంబరాలు

**ప్రజాశక్తి - చిట్టమూరు:** మండలంలోని చిట్టమూరు గ్రామానికి చెందిన టిడిపి యూత్ లీడర్ అరిగెల నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలలో మార్పు వచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైసిపికి డిపాజిట్ కూడా లేకుండా చేసి ఇంటికి పంపించినందుకు ప్రతి ఒక్కరికి చేతులు జోడించి నమస్కారాలు తెలిపారు. యాకసిరి తిప్ప మీద ఉన్న శివాలయం వద్ద భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. టపాకాయలు పేల్చి విజయోత్సవంలో మునిగి తేలారు. గూడూరు నియోజకవర్గంలో పాశం సునీల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న టిడిపి యూత్ లీడర్ అరిగెల నాగార్జున

## సుధీర్ రెడ్డికి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- రేణిగుంట:** శ్రీకాళహస్తి నియోజకవర్గం కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అఖండ విజయం సాధించడం పట్ల పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బుధవారం పట్టణ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డిని అభినందించి సన్మానించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట మండల ప్రజలు రుణం తీర్చుకోలేనిది, నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. రేణిగుంట అభివృద్ధికి తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని అభినందిస్తున్న రేణిగుంట టిడిపి నాయకులు

## కాపు భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం..

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతిలో కాపు భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కాపునాడు సంఘం జిల్లా అధ్యక్షుడు సరిత నాగరాజు రాయల్, యువజన నాయకుడు బండ్ల లక్ష్మీపతి రాయల్ కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి పవిత్రతను కాపాడుకోవడానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అంకితభావంతో కష్టి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముద్రగడ పద్మనాభం తన పేరును మార్చుకో వాలన్నారు.

## హోదాలు మరచి మాట్లాడారు : హేమకుమార్

**ప్రజాశక్తి -తిరుపతి (మంగళం) :**

ఉన్నత మంత్రి పదవుల్లో ఉండి జనసేన అధినేత పవన్‌కల్యాన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దిగజారుడుగా వ్యవహరించారని మాజీ మంత్రి పేర్నినాని, రోజాలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి హేమకుమార్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ అధికారంలో ఉంటూ మిడిసిపడిన వైసిపికి ప్రజల తీర్పుతో బుద్ధి వచ్చిందన్నారు. ముద్రగడ కాపులకు అన్యాయం చేశారని, ఆయన రెడ్డిగా మారితే రెడ్లకే అవమానమని అన్నారు.

## పదవికి సిరాజ్ రాజీనామా

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**

జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పదవికి వైసీపీ మైనారిటీ విభాగం నేత షేక్ సిరాజ్ బాషా బుధవారం రాజీనామా చేశారు. ఆ మేరకు స్టేట్ వక్ఫ్ బోర్డు సీఈవోకు తన రాజీనామా లేఖను పంపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తమ పార్టీ ఘోర పరాభవాన్ని ఎదుర్కొన్న సందర్భంగా ప్రజా తీర్పును గౌరవిస్తూ తానీ నిర్ణయం తీసుకున్నట్లు మిద్దెల హరి వివరించారు. తనకు సహకరించిన ఆర్టీసీ యాజమాన్యానికి, ప్రజలకు, నాయకులకు, అభిమానులకు ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు.

## నోరుపారేసుకున్న మంత్రులంతా మట్టికరిచారు: కీర్తన

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):**

అధికార దర్పంతో నోరు పారేసుకున్న వైసీపీ మంత్రులంతా ప్రజా తీర్పుతో నేలకరిచారని జనసేన అధికార ప్రతినిధి కీర్తన స్పష్టం చేశారు. బుధవారం జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను విముక్తి చేయడానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరిం చారన్నారు. ఆ ఫలితమే నేడు రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాట అయ్యేలా ప్రజలు తమ ఓట్లు ద్వారా ఆహ్వానించారన్నారు. క్రికెట్ టీం సభ్యులు లాగా వైసిపికి 2024 సార్వత్రిక ఎన్నికల్లో 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే నిలిచారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రావడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

## వైసిపి ఎంపీది సంచలన విజయం

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:**

తిరుపతి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుపు పొందితే తిరుపతి ఎంపీ మాత్రం సిటింగ్ ఎంపీ డాక్టర్ గురుమూర్తి సంచలన విజయం సాధించడం ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమితో అన్ని ప్రాంతాల్లో దూసుకుపోతుంటే పార్లమెంట్లో ఎన్నికల్లో మాత్రం బిజెపి అభ్యర్థి వరప్రసాదరావు ఓటమి చెందారు. తిరుపతి ఎంపీ పరిధిలో వైసిపి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా గెలవక పోయినా ఎంపీ సీటు సాధించడం ఆ పార్టీకి కొంత ఉపశమనం కలిగిస్తుంది. తిరుపతి ఎంపీ స్థానంలో 15 శాతం క్రాస్ ఓటింగ్ జరగడం వల్ల వైసీపీ ఎంపీ గురుమూర్తి గెలిచారు. కూటమి అభ్యర్థులకు సత్యవేడులో 3737, శ్రీకాళహస్తిలో 43,304, వెంకటగిరిలో 16,295, గూడూరులో 21,192, 16,288, 61,956, సూళ్లూరుపేటలో 29,115 మొత్తం 1.91 లక్షల ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే 15 శాతం క్రాస్ ఓటింగ్ వల్ల బిజెపి నేత వరప్రసాద్, వైసిపి అభ్యర్థి గురుమూర్తి చేతిలో 14,569 ఓట్ల తేడాతో ఓడారు.

# కొనసాగుతున్న భద్రత

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** ఎలక్షన్ కౌంటింగ్ పూర్తయినా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అమూల్య సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సమస్యాత్మక గ్రామాలలో ఇదివరకే ఏర్పాటుచేసిన పోలీస్ పికెట్లు యధాతతంగా వున్నాయి. కేంద్ర సాయుధ బలగాల సహకారంతో విస్తృతంగా, వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలలో ముమ్మరంగా తనిఖీలు చేస్తూ స్థానికులతో సమావేశాలు నిర్వహిస్తూ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నిరంతరం శాంతి భద్రతల పరిరక్షణలో నిమగ్నమైంది. గత 15 రోజులుగా జిల్లాలో విస్తృతంగా ఎన్ఫోర్స్మెంట్ విధులను సమర్థవంతంగా నిర్వహించి అసాంఘిక శక్తులను, అనుమానితులను ఎప్పటికప్పుడు నిలువరించి, ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకు జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తానికి ఎస్పి కృతజ్ఞతలు తెలిపారు.

భద్రతను పర్యవేక్షిస్తున్న సాయుధ బలగాలు

## టిడిపి సంబరాలు

**ప్రజాశక్తి- రేణిగుంట:** ఆంధ్ర లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఘన విజయం సాధించడం, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వెంకట సుధీర్ రెడ్డి అఖండ మెజారిటీతో గెలవడంతో తూకివాకం పంచాయతీ, వినాయక పురం గ్రామంలో టిడిపి నాయకుల సంబరాలు అంబరాన్ని అంటాయి. మొదట వినాయక స్వామికి పూజ నిర్వహించి ఉప సర్పంచ్ శ్రీనివాసులు 108 టెంకాయలను కొట్టి తన మొక్కులను తీర్చుకున్నారు. టిడిపి నాయకులు అందరూ కలిసి భారీ కేకును కట్ చేసి, బాణాసంచా పేల్చి ఘనంగా విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటీసీ నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. టిడిపి ప్రభుత్వంతో రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని, అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలో తిరుమల కు కాలినడకన వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామికి వెంట్రుకలు సమర్పించి మొక్కు తీర్చుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూకివాకం రెండవ వార్డు మెంబర్ ధనమ్మ, వినాయకపురం సీనియర్ టిడిపి నాయకులు మస్తాన్, మురళి, శంకరయ్య, సుబ్రహ్మణ్యం, సుధాకర్, నారాయణ స్వామి, వినోద్, ధనుంజయులు, నర్రావుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేణిగుంటలో

**రామచంద్రాపురం:** మూడు దశాబ్దాల అనంతరం చంద్రబాబు నాయుడు సొంత గ్రామమైన నారావారిపల్లి ఉండే చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్( నాని) అఖండ మెజారిటీతో విజయం సాధించి చంద్రగిరి కోటపై రారాజుగా తెలుగుదేశం జెండాను ఎగురవేసిన సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు బాణాసంచా పేల్చి 'జై తెలుగుదేశం, జై చంద్రబాబు నాయుడు, జై జై పులివర్తి నాని నినాదాలతో డప్పులు వాయిస్తూ చిందులు వేసి సంబరాలు చేసుకున్నారు. బుధవారం చంద్రగిరి లో వి సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా,ఐతేపల్లి పల్లిలో ఏవి రమణ,, ఎల్లప్ప రెడ్డి, చానంపట్లలో ముడిపల్లి సురేష్ రెడ్డి నాయకులు ఏ రంగంపేటలో భూపతి రాయల్, దేవీలాల్, కిరణ్, వాసు, వేణు కార్యకర్తలు పాల్గొన్నారు.

**తిరుపతి రూరల్‌లో:** నాని చంద్రగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో డాలర్ దివాకర్ రెడ్డి, ఏ ఈశ్వర్ రెడ్డి, కత్తి సుధాకర్ లు, పుదీపట్లలో బడి సుధా యాదవ్, చెర్లోపల్లి లో వైకుంఠం శ్రీధర్ నాయుడు, అభిలాలలో కొరకాల్వ సుధాకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు సంబరాల్లో పాల్గొన్నారు. తుమ్మలగుంటలో బిరుదుల భాస్కర్ రెడ్డి, దొడ్ల కరుణాకర్ రెడ్డి అయ్యప్ప, కృష్ణమూర్తి రెడ్డి, చెరుకూరి పరంధాం యాదవ్, ముని కృష్ణారెడ్డి, ఢిల్లీ యాదవ్ లు సంబరాలు చేశారు.

## ప్రజా తీర్పును స్వాగతిస్తున్నాం : కిలివేటి

**ప్రజాశక్తి -నాయుడుపేట:** ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని వైసిపి సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం నాయుడుపేట లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తనను రెండుసార్లు గెలిపించిన ప్రజలకు ఈ ఎన్నికల్లో 80 వేలకు పైగా ఓట్లు వేసిన ప్రజలకు, తన కోసం కష్టపడ్డ కార్యకర్తలకు, నాయకులకు, పార్టీ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుని స్వాగతి స్తున్నామని 2019 ఎన్నికల్లో తమ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి అంతటి ఘన విజయం చేకూర్చిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు 2024 ఎన్నికల్లో ఇలాంటి తీర్పునివ్వడం బాధాకరంగా ఉందని, కానీ ఈ అపజయానికి కృంగి పోకుండా ఓటమికి కారణాలు తెలుసుకుని వాటిని సరిదిద్దు కుంటామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి పథకాలు అందించామన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సులభంగా అందించేందుకు సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థ, ఇంటింటికి రేషన్ సరుకులు వంటి ఎన్నో పథకాలు ప్రజల కోసం ప్రవేశపెట్టామని అందులో ఏం లోపాలు ఉన్నాయో తమ పార్టీ నాయకులు వాటిపై సమీక్ష ఏర్పాటు చేసి ఆలోపాలు సరిదిద్దుకుని పార్టీని మరింత బలోపేతంగా ముందుకు తీసుకెళతామన్నారు.

మాట్లాడుతున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే

## గెలిపించినందుకు ధన్యవాదాలు

- గాలి భాను ప్రకాష్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** ప్రజల ఆశీర్వాదంతో తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృషి చేసిన పుత్తూరు పట్టణ, రూరల్ మండలం జనసేన, బిజెపి, శ్రేణులకు, ప్రజలకు ఎంతో రుణపడి ఉంటానని వారికి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. పుత్తూరు పట్టణంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూల మాలవేసి నివాళులు అర్పించారు. తర్వాత స్థానిక కార్వేటినగరం రోడ్డులోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలను కలిశారు. అభిమానులు పెద్ద ఎత్తున పూల దండలతో స్వాగతం పలుకుతూ పుష్ప గుచ్ఛాలిచ్చి శాలువా కప్పి సన్మానించారు. వారికి అభినందనలు తెలిపారు. పార్టీకి కట్టుబడిన నాయకు లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, గాలి గోపీనాథ్, టిడిపి జిల్లా యువత అధికార ప్రతినిధి, చినబాబు, డిఎన్ ఏలుమలై అమ్ములు, కుప్పయ్య, సర్పంచి బొబ్బిలి యాదవ్, వెంకటేష్, షణ్ముగం రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

## నెలవల విజయశ్రీ విజయం ఒక చరిత్ర

వెందోటి పార్థసారథి రెడ్డి

**ప్రజాశక్తి-నాయుడుపేట:**

సూళ్లూరుపేట నియోజక వర్గంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజయం ఒక చరిత్ర అని 40 ఏళ్ల టిడిపి చరిత్రలో సూళ్లూరుపేటలో ఒక మహిళకు సీటివ్వడం ఇదే ప్రథమం అని తొలిసారి పోటీ చేసిన విజయశ్రీ అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఆనందంగా వుందని నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, లాయర్ వేందోటి పార్థసారధి రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాయుడుపేట లాయర్లు అందరూ ఒక్క లాయర్ తప్ప తన మాటకు విలువ ఇచ్చి కూటమి అభ్యర్థి విజయశ్రీ కి మద్దతు తెలపడం ఆనందంగా వుందన్నారు. ఆమె నివాసానికి వెళ్లి తమ లాయర్స్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఇంతటి ఘన విజయానికి శ్రమించినందుకు లాయర్లకు గౌరవంతో ఆమెకి ఓట్లు వేసినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి ఘన విజయం అందుకున్న విజయశ్రీ ఆమె తండ్రి, మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం బాటలో నడుస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్య లు అర్థం చేసు కుంటూ వారందరికీ ఆమె తోడ్పాటు అందించాలని, ఆమె ప్రజారంజకంగా పాలన చేయాలని కోరుకున్నారు. లాయర్లకు నాయుడుపేటలో మార్కెట్ రేట్ తో ఇంటి స్థలాలు కేటాయించాలని మూడు సంవత్సరాల క్రితం అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని కానీ అది ఇప్పటికీ అమలు కాలేదన్నారు. లాయర్లకు ఈ సహాయం అందిం చాలని ఎమ్మెల్యే విజయశ్రీకి లాయర్ల అసోసియేషన్ తరపున విన్నవించు కుంటున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

## ఎంఇవో కార్యాలయానికి 'విద్యా కానుక' కిట్లు

విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** ఎంఇవో కార్యాలయానికి విద్యా కానుక కిట్లు బుధవారం చేరాయి. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు యూనిఫాం 1793 జతలు, ఒకటవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థినులకు 1,679 జతలు మొత్తం 3,472 జతల యూనిఫామ్‌ను మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వచ్చాయి. ఈ యూనిఫామ్‌ను అధికారులు పరిశీలించి ఎంఆర్‌సి సిబ్బంది ద్వారా వాటిని భద్రపరిచారు. ఈ యూనిఫామ్‌ను పాఠశాల పున:ప్రారంభం రోజున విద్యార్థిని విద్యార్థులకు అందించాలని ఆయా పాఠశాల ప్రధానో పాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్ సంస్థ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** స్థానిక త్యాగరాజా వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు బుధవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. దాతలు డాక్టర్ రోహిణమ్మ, , డాక్టర్ జనార్ధన్ రెడ్డి వివాహ దినోత్సవం సందర్భంగా 5 వేలు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, ఇన్నర్ వీల్ అధ్యక్షు రాలు విష్ణు వందన, మహిళ మండలి అధ్యక్షురాలు జమునమ్మ , లక్ష్మి, అనిత రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, మెదురు శ్రీనివాస ఆచారి, పల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## షరీఫ్‌ను కలిసిన తిరుపతి టిడిపి నేతలు

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ ను తిరుపతి టిడిపి మైనార్టీ నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. విజయవాడ లోని టిడిపి రాష్ట్ర సెంట్రల్ ఆఫీస్ లో రాష్ట్ర టిడిపి మైనార్టీ విభాగం ఆర్గనైజ్ కార్యదర్శి మహబూబ్ బాషా ఆధ్వర్యంలోటిడిపి మైనార్టీ కార్య వర్గం, మాజీ కౌన్సిల్ ఛైర్మన్ షరీఫ్ ని కలిసి టిడిపి అఖండ విజయం సాధిం చినందుకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టిడిపి మైనార్టీ విభాగం తిరుపతి ఉపాధ్యక్షులు హర్షద్, కార్యదర్శి నసరుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అక్బర్ పాల్గొన్నారు

మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్‌ను కలిసిన తిరుపతి మైనార్టీ నేతలు

## భయంతో ఓటేశారు: కిరణ్ రాయల్

**ప్రజాశక్తి -తిరుపతి(మంగళం):** సాధారణంగా ప్రజలు ఆశతో, కోపంతో ఓట్లు వేయడం చూసామని, కానీ ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనం భయంతో ఓటేయడం చూసామని జనసేన తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ 96 గంటలకు ముందు అధికారంలోకి వచ్చి మాట్లాడతానని తాను చేసిన శపథాన్ని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని కాపాడడానికి పవన్ కళ్యాణ్ ఒక బాహుబలి గా వచ్చాడని అభివర్ణించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వచ్చిన మెజారిటీ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగన్ నాలుగో తేదీ ప్రపంచమంతా ఆశ్చర్య పోయే ఫలితాలు వెలువడతాయని చెప్పారని, ఆ ఫలితాలు కూటమిది అని తరువాత తెలిసి వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, ఆర్కే రోజా టీటీడీ నిధులు 20 కోట్ల మేర బొక్కేసారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన నాయకురాలు ఆకేపాటీ సుభాషిని, సుమన్, సాయి, మునస్వామి పాల్గొన్నారు.

## దోచుకున్న వారికి ఓటుతో బుద్ధి వచ్చింది: చినబాబు

**ప్రజాశక్తి -తిరుపతి(మంగళం):** తిరుపతిలో ప్రజల ఆస్తులు దోచుకున్న వారికి ఓటుతో బుద్ధి చెప్పారని టిడిపి పట్టణ అధ్యక్షులు వట్టికుంట శంకరనారాయణ (చినబాబు) అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1952 భారతదేశంలో మొదలైన స్వతంత్ర ఎన్నికల ప్రక్రియలో నాడు 40 వేల పైచిలుకు ఓట్లు ఎన్టీఆర్ కు వచ్చాయని, అటు తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు వచ్చిందన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తన అధికారిక లెటర్ ప్యాడ్‌లను వినియోగించకుండా కూటమి గెలుపు పై అక్కస్సుతో తన రాజీనామా లేఖను ఇవ్వడం బాధాకరమన్నారు. భూమన అభినయ రెడ్డికి ఆరణి శ్రీనివాసులుకు వచ్చిన మెజారిటీ ఓట్లు కూడా రాలేదన్నారు. ఈ సమావేశంలో తిరుపతి జనసేన పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, మధుసూదన్, కోలా ప్రకాష్, దాము ఆచారి, సాయి పాల్గొన్నారు.

## ధర్మకర్తల మండలి పదవికి రాజీనామా

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితురాలు పదవికి శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలరు పుట్టు లీలావతి రాజీనామా బుధవారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెంది... టిడిపి కూటమి విజయం సాధించడంతో నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పుట్టు లీలావతి ఈ సందర్భంగా తెలిపారు. తన రాజీనామా లేఖను దేవదాయశాఖ కమిషనరు, ఆలయ ఈవోకు పంపానని ఆమె తెలిపారు.

## నానికి అభినందనల వెల్లువ

**ప్రజాశక్తి -రామచంద్రాపురం:** చంద్రగిరి నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన పులివర్తి వెంకటమణి ప్రసాద్ ( నాని)కి టిడిపి సీనియర్ నాయకులు సైకం చచంద్రారెడ్డి, జనసేన కన్వీనర్ దేవర మనోహర్ లో పుష్పగుచ్ఛాలతో ప్రత్యేక అభినందనలు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుండి నియోజక వర్గంలో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు టిడిపి జనసేన, కూటమి నాయకులు రఘునాథ రిసార్ట్స్‌లోని పులివర్తి నాని ఇంటి వద్ద ఏర్పాటు చేసిన అభినందనలు సభా వేదిక వద్దకు భారీగా తరలివచ్చారు. నాయకులు కార్యకర్తలు రాత్రి 10 గంటల వరకు నానిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని విజయాన్ని చేకూర్చిన కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జనసేన నియోజకవర్గ కన్వీనర్ కిరణ్ రాయల్, ఆకేపాటి సుభాషిని, రాజారెడ్డి, జనసేన టిడిపి, బిజెపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు ఆకస్మిక మృతి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** మంగళం క్వార్టర్స్ గ్రామపంచాయతీ పరిధిలోని బిటిఆర్ పురం లో నివాసం ఉంటున్న టిడిపి నాయకుడు పరశురాం అనారోగ్య కారణాలతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. స్థానిక నేతలు సంతాపం ప్రకటించారు.

# డాక్టర్ రవిరాజు సేవలు అభినందనీయం

పుత్తూరు ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ కృష్ణకాంత్

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** చిత్తూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాజు పరిచయం లేని వ్యక్తి అని, విధి నిర్వహణలో పరిధికి మించి ఆంత్రాక్స్ వంటి ప్రమాదకర వ్యాధిని ఆదిలోనే గుర్తించి పలువురి ప్రాణాలు కాపాడి అధికారుల మన్ననలు పొంది మెడల్స్‌ను అందుకున్నారని ఆయన సేవలు అభినందనీయమని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెం డెంటు డాక్టర్ కృష్ణ కాంత్ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ సన్మాన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణ భయం లేకుండా బాధితులకు సేవలు అందించారన్నారు. ప్రభుత్వ వైద్యాధికారుల సంఘానికి నేతృత్వం వహించి దిశదశ నిర్దేశం చేశారన్నారు. వృద్ధుల ఆరోగ్యానికి నడకే సరైన మందు అని సామాజిక పరంగా వృద్ధులను చైతన్య పరచి సంఘటిత పరచి ఇంటర్నే షనల్ వాకర్స్ అసోసియేషన్‌కు సారధి అయ్యారన్నారు. వైద్య పరంగా ఆయన సేవలు కుటుంబ నేపథ్యం, సాధించిన వ్యక్తిగత మైలురాళ్లను వివరించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం ఆర్ కెవిబి పేటలో రుక్కమ్మ, శ్రీరంగరాజులకు 1962లో రవి రాజు జన్మించారని, బీఎస్సీ ఎంబీబీ, ఎస్సీలను చేసిన ఆయన అనురాధను వివాహమాడి ఆశ్రిత, నవ్యతలకు జన్మనిచ్చి ఆ ఇద్దరు కుమార్తెలను తనదారిలోనే డాక్టర్లను చేయడం విశేషం అన్నారు. ప్రభుత్వ శాఖలో ప్రవేశించక ముందు కొద్ది కాలం ఆస్ట్రేలియాలో అక్కడి ప్రజలకు వైద్య సేవలను అందించారని, తనను వైద్యునిగా తీర్చిదిద్దిన పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు సంకల్పించి తిరిగి ఇక్కడికి చేరుకుని ప్రభుత్వ డాక్టర్‌గా వైద్య ప్రస్థానం చేపట్టారన్నారు. కార్వేటినగరంలో పని చేసే రోజుల్లో పశువులకు సోకే ఆంత్రాక్స్ వ్యాధి మనుషులకు సోకడంతో వెంటనే గుర్తించి ఆది లోనే అంతం చేసి పలువురు ప్రాణాలను కాపాడారని, చక్కెర వ్యాధిపై యుద్ధం ప్రకటించి పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు, అవగాహన నిర్వహించి భయం పోగొట్టారన్నారు. రికార్డు స్థాయిలో పుత్తూరులో ప్రసవ ఆపరేషన్‌లు నిర్వహించారని, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి జిల్లా అంతటా వైద్య సేవలతో పాటు అవగాహన కార్యక్రమా లను నిర్వహించారని తెలిపారు. ఈ చురుకుదనం గుర్తించిన ప్రభుత్వ డాక్టర్ల బృందం జిల్లా ఐఎంఏ సంఘానికి సారథ్యం వహించే అవకాశం కల్పిం చిందన్నారు. ఇందులోనూ తనదైన శైలితో సంఘానికి సేవలు అందించి ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యునిగా బిజీగా ఉంటూ మరో కోణంలో సంపూర్ణ ఆరోగ్యానికి నడకే మూల మంత్రమని విశ్వసించి పుత్తూరులో మిత్రులతో కలిసి వాకర్స్ అసోసియేషన్‌లో తన వంతు పాత్రతో ప్రవేశించి అంచలంచెలుగా ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ కు సారథిగా నిలిచారన్నారు. వైద్యునిగా బహుముఖ పాత్రలో నిలిచిన డాక్టర్ రవి రాజు గత నెల 31 వ తేదీ జిల్లా వైద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేశారన్నారు. వైద్యునిగా ప్రభుత్వ శాఖలో లేకపోయినా పుత్తూరు పరిసర ప్రాంతంలో పేదల డాక్టర్‌గా స్థిర స్థానాన్ని సంపాదిం చిన ఆయన జీవితాంతం వైద్య సేవలు అందించేందుకు సాయిబాబా వీధిలో ప్రజా వైద్యశాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రజల ఆశీస్సులతో మరింత ఉత్తమ వైద్య సేవలు అందిం చాలని కోరారు. అనంతరం డాక్టర్లు, సిబ్బంది కలిసి పెద్ద ఎత్తున సన్మానిం చి అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

డాక్టరు రవిరాజును సన్మానించి కానుకను సమర్పిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది

# జనం భయంతో ఓటేశారు: కిరణ్ రాయల్

**తిరుపతి(మంగళం):**

సాధారణంగా ప్రజలు ఆశతో, కోపంతో ఓట్లు వేయడం చూసామని, కానీ ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనం భయంతో ఓటేయడం చూసామని జనసేన తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ 96 గంటలకు ముందు అధికారంలోకి వచ్చి మాట్లాడ తానని తాను చేసిన శబధాన్ని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని కాపాడడానికి పవన్ కళ్యాణ్ ఒక బాహుబలి గా వచ్చాడని అభివర్ణించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వచ్చిన మెజారిటీ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగన్ నాలుగో తేదీ ప్రపంచమంతా ఆశ్చర్య పోయే ఫలితాలు వెలువడతాయని చెప్పారని, ఆ ఫలితాలు కూటమిది అని తరువాత తెలిసి వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, ఆర్కే రోజా టీటీడీ నిధులు 20 కోట్ల మేర బొక్కేసారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన నాయకురాలు ఆకేపాటీ సుభాషిని, సుమన్, సాయి, మునస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన నాయకులు కిరణ్‌రాయల్